సాక్షి ఒడిశా

మంగళవారం । 16 । మే । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,72,747, వెండి 344 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



మంత్రిమండలి పునర్వ్యవస్థీకరణ! - 8లో



వినతుల పరిష్కారానికి చర్యలు - 8లో

న్యూస్‌రీల్

ఫలితాలపై కాంగ్రెస్ త్రిసభ్య కమిటీ

భువనేశ్వర్: ఝార్సుగుడ నియోజకవర్గ ఉపఎన్నికలో కాంగ్రెస్ ఘోర పరాజయానికి చవిచూసింది. ఈ పరిణామం పూర్వాపరాలు విశ్లేషించేందుకు ఒడిశా ప్రదేశ్ కాంగ్రెసు కమిటీ(ఓపీసీసీ) త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీ త్వరలో ఝార్సుగుడ నియోజకవర్గాన్ని సందర్శిస్తుంది. ఈ బృందం ఉప ఎన్నికలో పార్టీ ఓట్ల శాతం ఎందుకు తగ్గుముఖం పట్టిందో తెలుసుకునే దిశలో క్షేత్రస్థాయిలో ప్రభావిత పరిస్థితులను సమీక్షిస్తుంది. అనంతరం సమగ్ర నివేదిక సమర్పిస్తుందని ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శరత్ పట్నాయక్ తెలిపారు. రాష్ట్ర మాజీ ఆరోగ్య-కుటుంబ సంక్షేమశాఖ మంత్రి నవకిషోర్ దాస్ హత్యకు గురి కావడంతో ఈ నియోజకవర్గంలో ఉప ఎన్నిక జరిగింది. దివంగత మంత్రి కుమార్తె దీపాలీదాస్ 1,07,003 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించింది. సమీప ప్రత్యర్థిగా భారతీయ జనతా పార్టీ అభ్యర్థి టొంకొధొరొ త్రిపాఠి 58,384 ఓట్లు సాధించగా.. కాంగ్రెస్ అభ్యర్థి తరుణ్ పాండేకు మొక్కుబడిగా 4,473 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఈ పరిస్థితితో రాష్ట్ర కాంగ్రెస్ తల్లడిల్లుతోంది. పార్టీ అంతర్గత కలహాలే కారణంగా కాంగ్రెస్ శిబిరంలో చర్చ సాగుతోంది.

22కిలోల గంజాయి స్వాధీనం



గంజాయితో పోలీసుల అదుపులో నిందితులు

రాయగడ: జిల్లాలోని గుడారిలో పోలీసులు ఆదివారం సాయంత్రం నిర్వహించిన వాహన తనిఖీల్లో 22 కిలోల గంజాయి పట్టుబడింది. ఈ మేరకు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో కేరళకు చెందిన మంగేష్ రంజిత్, అజిత్‌కుమార్ బాహక్, గజపతి జిల్లాకు చెందిన నీలమణి జెస్వీలు ఉన్నారు. నిందితులను కోర్టుకు తరలించినట్లు ఐఐసీ దీనబంధు సాబొరొ తెలిపారు. రోజువారీ తనిఖీల్లో భాగంగా గుడారి కూడలిలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, బైక్‌పై ముగ్గురు వ్యక్తులు 2బస్తాల్లో గంజాయిని తీసుకు వెళ్తున్నట్లు గుర్తించి పట్టుకున్నారు. నిందితుల నుంచి 3సెల్‌ఫోన్లు, రూ.800ల నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.

ప్రభుత్వ సొమ్ముతో బీజేడీ ఎమ్మెల్యేల జల్సాలు

- బీజేపీ ఎమ్మెల్యే సుభాష్ పాణిగ్రాహి విమర్శలు



దేవ్‌గడ్ ఎమ్మెల్యే సుభాష్ పాణిగ్రాహి

భువనేశ్వర్: ప్రభుత్వ సొమ్ముతో అధికార పక్షం బిజూ జనతాదళ్ ఎమ్మెల్యేలు మజా చేస్తున్నారని సీనియర్ నాయకుడు, దేవ్‌గడ్ ఎమ్మెల్యే సుభాష్ పాణిగ్రాహి ఆరోపించారు. రాష్ట్రప్రభుత్వ ఖర్చులతో పలువురు ఎమ్మెల్యేలు సోమవారం దుబాయ్ పయనమయ్యారు. ఈ చర్యను ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. బీజేడీ సభ్యులు రాష్ట్ర నిధులను దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. బిజూ జనతాదళ్ ఎమ్మెల్యేలు ప్రభుత్వ సొమ్ముతో దుబాయ్ పర్యటనకు వెళ్తే.. దానిని ఖండించాలి. అధికార పార్టీ సభ్యులు విదేశీ పర్యటనలు చేయడం ద్వారా ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేయడానికి అనుమతించకూడదు' అని మీడియా ముందు అభిప్రాయం వ్యక్తంచేశారు. ఎమ్మెల్యేల విదేశీ పర్యటనకు నిర్ధారిత మార్గదర్శకాలు ఉన్నాయని, వాటికి అనుగుణంగా ప్రభుత్వం వ్యవహరించడం అనివార్యమని గుర్తుచేశారు. అధికార బీజేడీ ప్రభుత్వ సొమ్ముతో విదేశీ పర్యటనలు, ఇతర కార్యకలాపాలను చేపట్టడం ద్వారా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. దుబాయ్‌లో జరగనున్న ఉత్కళ దివస్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు రాష్ట్ర శాసనసభ్యులు దుబాయ్ వెళ్లాల్సి వస్తే.. అఖిలపక్ష సభ్యుల సంప్రదింపులతో కార్యక్రమం ఖరారు చేసి కలిసికట్టుగా ముందుకు సాగాల్సి ఉందన్నారు. అయితే ఏకపక్షంగా అధికార బీజేడీ సభ్యులతో ఇటువంటి కార్యక్రమాలను ప్రోత్సహించడం సమంజసం కాదని ఎత్తిచూపారు. వాస్తవానికి ఉత్కళ దివస్ ఏటా ఏప్రిల్ 1న నిర్వహిస్తారని, ప్రజలను తప్పుదోవ పట్టించి ప్రవాసేతర ఒడియాలను ఆకర్షించడానికి బీజేడీ నాటకాన్ని ప్రదర్శిస్తోందన్నారు. ప్రభుత్వ ఖజానా నిధులతో పశ్చిమ ఒడిశా అభివృద్ధి మండలి(డబ్ల్యూఓడీసీ)తో సహా పలు ఏజెన్సీల నుంచి నిధులను బీజేడీ సొంత రాజకీయ కార్యకలాపాల కోసం అడ్డదారిలో మళ్లిస్తుందని ఆక్షేపించారు.

బంద్ ప్రశాంతం..!



రాయగడ: బస్టాండ్‌లో నిలిచిపోయిన బస్సులు



రాయగడ: చంద్రపూర్-మునిగుడ రహదారికి అడ్డంగా దర్శనమిస్తున్న చెట్లు, బ్యానర్

- నిశ్శబ్దంగా మారిన గిరిజన గూడేలు
- అటవీ ప్రాంతాల్లో కొనసాగుతున్న కూబింగ్
- మావోయిస్టులు చెట్లు నరికి వేయడంతో నిలిచిన రాకపోకలు

బరంపురం: కొందమాల్ జిల్లాలో మావోయిస్టులు చేపట్టిన 2 రోజుల బంద్ ప్రశాంతంగా ముగిసింది. 4రోజుల క్రితం ఛత్తీస్‌గఢ్ లోని దంతెవాడ జిల్లాలో సీఆర్‌పీఎఫ్ జవాన్లతో జరిగిన ఎదురు కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. ఈ ఘటనకు నిరసనగా బంద్‌కు పిలుపునివ్వడంతో ప్రభావిత ప్రాంతాలైన కొందమాల్, గంజాం, గజపతి, రాయగడ, కలహండి, మల్కన్‌గిరి, కొరాపుట్ జిల్లాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడిపారు. గిరిజన గూడేల్లో జనం ఇళ్లకే పరిమితమయ్యారు. భద్రతా దళాల ఆకస్మిక తనిఖీలు, మావోయిస్టుల అలజడితో ఆందోళనకు గురయ్యారు. మరోవైపు ఆది, సోమవారాల్లో బల్లిగుడ పోలీసు స్టేషన్ పరిధి సిమన్‌బడి, దరింగబడి అటవీ ప్రాంతం, ఫుల్బాణి పట్టణానికి వెళ్లే ప్రధాన రహదారి 59వ నంబర్ జాతీయ రహదారి సిమన్‌బడి వద్ద మావోయిస్టుల పోస్టర్లు స్థానికులకు దర్శనమివ్వడంతో కలకలం రేపింది. దీనిపై 12 డిమాండ్లతో కూడిన ప్రకటనలు గుర్తించిన పోలీసులు.. వాటిని స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు జిల్లా సరిహద్దుల్లో భద్రతా దళాలు గట్టి నిఘా ఏర్పాటు చేశారు. అటవీ ప్రాంతాల్లో సీఆర్‌పీఎఫ్, ఎస్‌ఓజీ, జిల్లా పోలీసుల సాయంతో ముమ్మరంగా కూబింగ్ చేపట్టారు. సరిహద్దుల్లో వచ్చిపోయే వాహనాలను క్షుణ్నంగా తనిఖీ చేస్తున్నారు. కొందమాల్ జిల్లా కళింగా ఘాటీపై చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు.

చంద్రపూర్‌లో పోస్టర్ల కలకలం

రాయగడ: జిల్లాలోని చంద్రపూర్‌ల మావోయిస్టు పోస్టర్లు కలకలం సృష్టించాయి. సమితిలోని పంకులుగుడి గ్రామంలో వంతెన వద్ద పోస్టర్ దర్శనమివ్వగా, అదే రహదారి నుంచి మునిగుడ వైపు వెళ్లే రోడ్డు మధ్య మరో బ్యానర్ దర్శనమిచ్చింది. వివిధ ప్రాంతాల్లో భారీ చెట్లను నరికివేసి, రోడ్డుకు వేయడంతో చంద్రపూర్ నుంచి మునిగుడ, బిసంకటక్, అంబోదొల తదితర ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. రాష్ట్రంలోని 7 జిల్లాల్లో బంద్‌కు పిలుపునివ్వగా తమ ఉనికి చాటుకునే విధంగా బ్యానర్లు, పోస్టర్లు అతికించి, తమ నిరసన తెలియజేశారు. ప్రజలకు విద్య, వైద్యం, రాకపోకలు వంటి మౌలిక సౌకర్యాల కల్పనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమ్యాయని అందులో పేర్కొన్నారు. అలాగే కలహండిలో బూటకపు ఎన్‌కౌంటర్‌కు నిరసనగా ఈ బంద్ చేపడుతున్నట్లు వంశధార-ఘుముసుర డివిజన్ దళం ప్రకటించింది.

నిలిచిన బస్సులు..

మావోయిస్టు బంద్ పిలుపు మేరకు రాయగడ నుంచి చుట్టుపక్కల గ్రామాలకు వెళ్లే బస్సులను స్థానిక కొత్త బస్టాండ్‌లో నిలిపివేశారు. దీంతో రాకపోకలు స్తంభించాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాయగడ నుంచి కాసీపూర్, చంద్రపూర్, మునిగుడ తదితర ప్రాంతాలకు రాకపోకలు కొనసాగించే ప్రభుత్వ, ప్రైవేటు బస్సులు నిలిచిపోయాయి.



బంద్ పిలుపుతో నిశ్శబ్దంగా మారిన కొండమాల్ జిల్లాలోని గిరిజన గ్రామం



కొండమాల్-గజపతి-గంజాం జిల్లాల సరిహద్దులో కూబింగ్ నిర్వహిస్తున్న ఎస్ఓజీ జవాన్లు



జిల్లా సరిహద్దులో వాహనాల తనిఖీ చేపడుతున్న భద్రతా దళాలు

దీపాలి దాస్ ప్రమాణ స్వీకారం



ఝార్సుగుడ శాసనసభ ప్రతినిధిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న దీపాలి దాస్

- హాజరైన మంత్రులు ప్రమీలా మల్లిక్, రీతా సాహు
- సీఎం మార్గదర్శకంలో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దీపాలీ

భువనేశ్వర్: ఝార్సుగుడ ఎమ్మెల్యేగా దీపాలీ దాస్ సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ముందస్తు షెడ్యూల్ ప్రకారం ఉదయం 10:45 గంటలకు ఈ కార్యక్రమానికి హాజరు కాగా, శాసనసభ డిప్యూటీ స్పీకర్ రజనీకాంత్ సింగ్ ఆమెతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమానికి ఆమె తల్లి, సోదరుడు, మంత్రులు ప్రమీలా మల్లిక్, రీతా సాహు తదితరులు హాజరయ్యారు. ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. ఘన విజయంతో ఓటర్లు కట్టబెట్టిన గురుతర బాధ్యతను అంకిత భావంతో నిర్వహిస్తానని ప్రకటించారు. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ మార్గదర్శకంలో ఝార్సుగుడ నియోజకవర్గ బహుముఖ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఇటీవల ముగిసిన ఉప ఎన్నికల్లో దీపాలీ దాస్ మీప ప్రత్యర్థి, బీజేపీ నాయకుడు టొంకొధొరొ త్రిపాఠిపై 48,721 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందిన విషయం తెలిసిందే. ప్రమాణ స్వీకారానికి ముందు సోదరుడు విశాల్ దాస్ ఆదివారం నవీన్ నివాస్‌లో పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌ను కలిసి ఆశీస్సులు అందుకున్నారు. ఈ విజయం ఝార్సుగుడ ఉప ఎన్నికలో చారిత్రాత్మక విజయమని సీఎం అభినందించారు. నియోజకవర్గ అభివృద్ధికి నాయకత్వం వహించాలని, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి అంకితభావంతో పని చేయాలని ఆమెకు సూచించారు. ఇదిలా ఉండగా.. దీపాలి దాస్ సుమారు ఏడాది కంటే తక్కువ కాలమే ఈ పదవిలో ఉంటారు. 2024 సార్వత్రిక ఎన్నికలు సమీపంలో ఉండటమే ప్రధాన కారణం.

తిరుగులేని బీజేడీ..

ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ 5వ విడత పాలనలో 8 నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు జరిగాయి. అత్యధికంగా 7 చోట్ల జరిగిన ఉప ఎన్నికల్లో ఆయన నేతృత్వంలో బిజూ జనతాదళ్ విజయ శంఖారావం చేయగా.. మరో స్థానంలో భారతీయ జనతా పార్టీ తన సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకుంది. కాంగ్రెస్ పత్తా లేకుండా పతనమైంది. 2000 తర్వాత ఈ విడతలో రాష్ట్రంలో అత్యధిక ఉప ఎన్నికలు జరగడం విశేషం.

ప్రాచీన కళలను పరిరక్షించుకోవాలి



పోటీలో భాగంగా దురువ నృత్యం చేస్తున్న కళాకారులు

- తరుణ ప్రజ్ఞాభారతి అధ్యక్షుడు డాక్టర్ గంగాధర నందొ

జయపురం: కొరాపుట్ ఆదివాసీ నృత్య, సంగీత కళలు అతి ప్రాచీనమైనవని, వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని జయపురం తరుణ ప్రజ్ఞాభారతి అధ్యక్షుడు డాక్టర్ గంగాధర నందొ ఆకాంక్షించారు. ప్రాచీన సంప్రదాయాలు, ఆచారాలు, సంగీత, నృత్య కళలను ప్రోత్సహించేందుకు తరుణ ప్రజ్ఞాభారతి కృషి చేస్తోందని, ఇందులో భాగంగా వివిధ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. జయపురం సబ్ డివిజన్ పరిధి బొయిపరిగుడ సమితిలోని గుప్తేశ్వర్ పంచాయతీ సొరిగిపాదర్ గ్రామంలో శబర సుకన్య ప్రతిభా పోటీలు సోమవారం నిర్వహించారు. ఇందులో సొరిషపొదర్, సిరిగుడ, తాలూరు, ముర్జటువ గ్రామాల నుంచి దురువ ఆదివాసీ ప్రజలు పాల్గొని, వారి సంప్రదాయ నృత్య, నాట్య, సంగీతాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి యజ్ఞేశ్వర పండా, సహాయ కార్యదర్శి లక్ష్మీకాంత మిశ్రా, ఆదివాసీ పరిశోధకులు రాజేంద్రపాఢి, వనవాసి సంస్కృతి కో-ఆర్డినేటర్ ప్రఫుల్లకుమార్ పాఢి, గుప్తేశ్వర పంచాయతీ సమితి సభ్యులు బిభీషణ హంతాల్, సిరిబెడ ఉన్నత ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం కులమణి జెనా తదితరులు ఆదివాసీ జీవనశైలిపై ప్రసంగించారు. శబరీ సుకన్య పోటీల్లో సల్లవీ దురువ, పాకిలీ దురువ, రూపా దురువ, సంగీత పోటీలలో భగవతీ దురువ, గుప్తా దురువ, జగన్నాథ దురువ, వరుసగా.. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు తరుణ ప్రజ్ఞాభారతి వార్షికోత్సవంలో బహుమతులు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

దుబాయ్.. రయ్‌రయ్..



తొలి విమాన సర్వీసును జెండా ఊపి ప్రారంభిస్తున్న సీఎం నవీన్ నాయక్



దుబాయ్ నుంచి విచ్చేసిన పర్యాటకులను సాదరంగా ఆహ్వానిస్తున్న అధికారులు

- భువనేశ్వర్-దుబాయ్ మధ్య తొలి విమాన సర్వీసు
- ప్రారంభించిన సీఎం నవీన్ పట్నాయక్
- ఇరుప్రాంతాల మధ్య వారానికి 3రోజులు సేవలు

భువనేశ్వర్: రాష్ట్రాన్ని ప్రపంచంతో అనుసంధానం చేసే కార్యచరణలో భాగంగా దుబాయ్‌కి ప్రత్యక్ష విమానయాన సౌకర్యం ప్రారంభిస్తున్నట్లు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తెలిపారు. గత ఏడాది జూన్‌లో జరిగిన ఒడిశా పెట్టుబడిదారుల సదస్సును పురస్కరించుకుని ఒడిశా-దుబాయ్ మధ్య ప్రత్యక్ష అంతర్జాతీయ విమానయానం సౌకర్యం కల్పిస్తామని సీఎం ఇదివరకే ప్రకటించారు. దీనిని పురస్కరించుకొని భువనేశ్వర్ బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి దుబాయ్ వెళ్లే తొలి విమానాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒడిశాను దుబాయ్ వంటి ప్రపంచ పర్యాటక ప్రాధాన్య ప్రాంతాలతో అనుసంధానం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడులను సులభతరం చేయడం, పర్యాటక రంగం ప్రోత్సహించడం, దేశం వెలుపల నివసిస్తున్న ఒడియా ప్రవాసుల కోసం రవాణా సదుపాయాలను అందుబాటులోకి తేవడం వంటి ప్రయోజనాలతో ప్రపంచ స్థాయి అభివృద్ధికి ప్రపంచ దేశాల అనుసంధానం(గ్లోబల్ కనెక్టివిటీ) కీలకమైన సోపానంగా పేర్కొన్నారు. మధ్యప్రాచ్యంలో(మిడిల్ ఈస్టు) పేరొందిన ప్రధాన ప్రయాణ, పర్యాటక ప్రాంతం దుబాయ్ అని గుర్తుచేశారు. ఇది యూరోపియన్, సంయుక్త రాష్ట్ర(యూఎస్) మార్కెట్‌లకు ప్రవేశ ద్వారంగా వర్తక వ్యాపార రంగాల్లో రాణిస్తున్న ప్రాంతమని తెలిపారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన దుబాయ్‌తో రాష్ట్రాన్ని అనుసంధానం పరిచిన ఈ రోజును గ్లోబల్ కనెక్టివిటీ వైపు, ఒడిశా పురోగతిలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టిన సందర్భంగా నిలిచి పోతుందన్నారు.

170మందితో తొలి రవాణా..

భువనేశ్వర్ నుంచి దుబాయ్‌కి బయల్దేరిన తొలిరోజు విమానంలో సిబ్బందితో సహా మొత్తం 170మంది ప్రయాణించారు. వీరిలో మిషన్‌శక్తి, వరల్డ్ స్కిల్‌సెంటర్, స్పెషల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్, పంచాయతీరాజ్ నాయకులు, సభ్యులు, ప్రముఖ క్రీడాకారులతో 12మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరందరికీ సాదరంగా వీడ్కోలు పలికేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అంతకుముందు విమానాశ్రయం ప్రాంగణంలో కేక్ కట్ చేసి, ఉత్సాహం వ్యక్తం చేశారు. ప్రయాణికులకు ఉత్తరీయం ప్రదానం చేసి రాష్ట్ర పర్యాటక విభాగం ఏర్పాటు చేసిన కిట్ బ్యాగ్‌తో సత్కరించారు. డిపార్చర్ టెర్మినల్ వద్ద హోస్టెస్‌లు తొలి ప్రయాణికులకు స్వీట్లు, పువ్వులు అందించారు. దుబాయ్ నుంచి రాష్ట్రానికి చేరిన తొలి విమానంలో విచ్చేసిన ప్రయాణికులకు రాష్ట్ర పర్యాటక, ఒడియా భాష, సంస్కృతి, సాహిత్య విభాగం మంత్రి అశ్వినికుమార్ పాత్రొ, వాణిజ్య, రవాణాశాఖ మంత్రి టుకుని సాహు సాదరంగా ఆహ్వానించారు.

రాకపోకలు రూ.20 వేలు..

ఇండిగో ఎయిర్‌లైన్స్ భువనేశ్వర్-దుబాయ్ మధ్య ప్రత్యక్ష విమానయాన సేవలు కల్పిస్తోంది. వారంలో 3రోజులు(సోమ, బుధ, శుక్రవారాల్లో) ఈ సేవలు అందుబాటులో ఉంటాయి. దుబాయ్ నుంచి ఉదయం 11.25 గంటలకు బయల్దేరి సాయంత్రం 5.20 గంటలకు భువనేశ్వర్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి సాయంత్రం 6.30 గంటలకు బయల్దేరి రాత్రి 9.45 గంటలకు దుబాయ్ చేరుకుంటుంది. ఈ ప్రాంతాల ఒకవైపు ప్రయాణ చార్జీ రూ.10 వేలు కాగా.. ఇరువైపులా రూ.20 వేలుగా ప్రకటించారు.

నిందితులను పట్టుకుంటాం



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సైంటిఫిక్ బృందం

- గుణుపూర్ ఎస్‌డీపీఓ రంజన్ బెవురా
- సామాజిక కార్యకర్త హత్య కేసులో దర్యాప్తు ముమ్మరం

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో సంచలనం సృష్టించిన ఆశా స్వచ్ఛంద సేవాసంస్థ డైరెక్టర్ గౌరీ మిశ్రొ హత్యకు సంబంధించి నిందితులను త్వరలోనే పట్టుకుంటామని ఎస్‌డీపీఓ వికాష్‌రంజన్ బెవురా ప్రకటించారు. గుణుపూర్‌లోని వంశధార నది వంతెనపై శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు సామాజిక కార్యకర్తను తుపాకీతో కాల్చి చంపిన విషయం తెలిసిందే. ఈ మేరకు మృతదేహాన్ని పోలీసులు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం సమయంలో గౌరీ తలభాగం నుంచి తుపాకీ గుండును వైద్యులు బయటకు తీశారు. దర్యాప్తులో భాగంగా రాయగడ నుంచి సైంటిఫిక్ బృందం ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాల కోసం గాలించారు. ఈ క్రమంలో తుపాకీ గుండు లభించింది. అయితే సరైన ఆధారాలు లభించక పోవడంతో దర్యాప్తును మరో కోణంలో చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అయితే ఎట్టి పరిస్థితిలోనూ నిందితులను పట్టుకుని తీరుతామని చెబుతున్న పోలీసులు.. కేసును ఛేదించే విషయంలో తలమునకలై ఉన్నారు. ఇదిలా ఉండగా బీజేడీ జిల్లా అధ్యక్షుడు సుధీర్ దాస్, గుణుపూర్ ఎమ్మెల్యే రఘునాథ్ గమాంగొ తదితరులు బాధిత కుటుంబాన్ని సోమవారం పరామర్శించారు. గుణుపూర్‌లో ఈ తరహ హత్య జరగడం ఇదే తొలిసారని విచారం వ్యక్తంచేశారు.



హత్య జరిగిన ప్రాంతంలో లభించిన తుపాకీ గుండు

సీసీ కెమెరాల ఏర్పాటుపై..

అభివృద్ధి చెందుతున్న గుణుపూర్‌లో శాంతి భద్రతల నియంత్రణ చర్యల్లో భాగంగా సీసీ కెమెరాల ఏర్పాటు విషయంలో మున్సిపాలిటీ యంత్రాంగం జాప్యం వహిస్తుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చాలా రోజుల క్రితం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో సీసీ కెమెరాల ఏర్పాటు ప్రస్తావన వచ్చినప్పటికీ ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. నిఘా వ్యవస్థ ఏర్పాటు చేసి ఉంటే.. నిందితులను సులభంగా గుర్తించేవారని విమర్శలు వినిపిస్తున్నాయి. మంగళవారం మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశం ఉన్నప్పటికీ అనివార్య కారణాల వల్ల బుధవారం నాటికి వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో సీసీ కెమెరాల ఏర్పాటుపై చర్చకు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ఖరీఫ్ లక్ష్యం రూ.550 కోట్లు



జయపురంలోని కొరాపుట్ కేంద్ర సహకార బ్యాంక్ ప్రధాన కార్యాలయం



కేసీసీ బ్యాంక్ అధ్యక్షుడు పాణిగ్రాహి

- రుణ ప్రణాళికలను వెల్లడించిన కొరాపుట్ కేంద్ర సహకార బ్యాంకు

జయపురం: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో కొరాపుట్ కేంద్ర సహకార బ్యాంక్(జయపురం) బ్యాంక్ పరిధిలోని కొరాపుట్, మల్కన్‌గిరి, రాయగడ, నవరంగపూర్ జిల్లాలో రైతులకు రూ.550 కోట్లు రైతులకు వ్యవసాయ రుణాలుగా అందించాలని బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వరచంద్ర పాణిగ్రాహి బ్యాంక్ అధికారులను ఆదేశించారు. ఖరీఫ్ రుణ ప్రణాళికపై ఆయన సోమవారం మాట్లాడారు. ఇందులో భాగంగా కొరాపుట్ జిల్లా రూ.203 కోట్లు, నవరంగపూర్ రూ.160 కోట్లు, రాయగడ రూ.105 కోట్లు, మల్కన్‌గిరి జిల్లా రైతులకు రూ.82 కోట్ల మేర మంజూరు చేసేందుకు లక్ష్యంగా నిర్దేశించుకున్నామని తెలిపారు. రూ.లక్ష వరకు వడ్డీ 4శాతం, రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు 5శాతం వడ్డీ నిర్ణయించామని వెల్లడించారు. నాబార్డు నిబంధనలకు అనుగుణంగా రుణాలు మంజూరు చేస్తామని ప్రకటించారు. అలాగే మరింత మంది రైతులను బ్యాంకు సభ్యులుగా చేర్చుకోవాలన్నారు. రుణాలు కేటాయించడంతో పాటు సీజన్ ముగిసే నాటికి తిరిగి వసూలు చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని వివరించారు. అలాగే రైతులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకొని, సకాలంలో పంటలు పండించాలని సూచించారు. అవిభక్త కొరాపుట్ జిల్లాల్లో రైతులు వ్యవసాయ రుణాలకు కేసీసీ బ్యాంక్ శాఖలు, వాటి పరిధిలోని ల్యాంపుల పైనే అధికంగా ఆధారపడుతున్నారు. 4 జిల్లాల్లో మొత్తం 23 బ్రాంచ్‌లు, 54 ల్యాంపులు (లార్జ్ ఆదివాసీ మల్టీపర్పస్ కో-ఆపరేటిక్ సొసైటీలు), ఒక మల్టీపర్పస్ కో-ఆపరేటివ్ సొసైటీ ఇందులో సేవలందిస్తున్నాయి.

క్లుప్తంగా

మామిడిపల్లిలో ఆధ్యాత్మిక శోభ

- ముంగారమ్మతల్లిని దర్శించుకున్న డిప్యూటీ సీఎం



ముంగారమ్మ తల్లిని దర్శించుకుంటున్న డిప్యూటీసీఎం పీడిక రాజన్నదొర, నాయకులు

సాలూరు: మండలంలోని మామిడిపల్లి గ్రామ దేవత ముంగారమ్మతల్లి ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పసుపుకుంకుమలు, ఘటాలు సమర్పించారు. మొక్కుబడులు చెల్లించారు. ఆధ్యాత్మిక చింతనతో గడిపారు. డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖమంత్రి పీడిక రాజన్నదొర అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు అందుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. తాగునీరు, విద్యుత్ సదుపాయాలపై ఆరా తీశారు. అధికారులకు పలు సూచనలు చేశారు.

19న మెగా జాబ్‌మేళా



మెగా జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 19న సీతంపేట ఐటీఐలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం విడుదల చేశారు. జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. టెన్త్, యూజీ, పీజీ కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించిన 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వారు అర్హులన్నారు. మెగా జాబ్‌మేళాకు 12 కంపెనీల నుంచి ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. ప్రొడక్షన్, ఫార్మాసిస్టు, రిటైల్, మెషిన్ ఆపరేటర్, సేల్స్‌ఎగ్జిక్యూటివ్, ఫ్రంట్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్ వంటి ఉద్యోగాలకు ఎంపికలు జరుగుతాయన్నారు. వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్‌డీసీ. ఇన్‌లో అప్‌లై చేసుకోవాలన్నారు. వివరాలకు ఫోన్ 70320 60773, 63051 10947 నంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపాల్ టీవీ గిరి, స్కిల్ డెవలప్‌మెంట్ మేనేజర్ సాయికుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై శిక్షణ

విజయనగరం: ప్రభుత్వ పథకాలు అర్హులకు వర్తింపజేయడం, పర్యవేక్షణ, సమస్యల పరిష్కారంపై క్షేత్రస్థాయి సిబ్బందికి ఈ నెల 15 నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు 16 రోజుల పాటు శిక్షణ ఇస్తామని మెప్మా పీడీ సుధాకర్ తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన సాంకేతిక, సహాయక సిబ్బంది 400 మందికి విజయనగరంలోని యూత్ హాస్టల్‌లో రెసిడెన్షియల్ శిక్షణ ఉంటుందని, బ్యాచ్‌కు 50 మంది చొప్పున రెండురోజుల పాటు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తామని వివరించారు. మొదటి రోజు సోమవారం ఉమ్మడి జిల్లాకు చెందిన సిబ్బంది, మెప్మా రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారన్నారు. షెడ్యూల్ ప్రకారం నిర్వహించే శిక్షణ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మాదలింగిలో గజరాజుల తిష్ట



మాదలింగి గ్రామ పరిసరాల్లో సంచరిస్తున్న ఏనుగులు

కొమరాడ: మండలంలోని మాదలింగి గ్రామ పరిసరాల్లో గజరాజులు తిష్టవేశాయి. దీంతో అక్కడి రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొలాల్లోని పామాయిల్, మొక్కజొన్న పంటలతో పాటు మోటార్లను నాశనం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే అదే ప్రాంతంలో కొన్నాళ్లుగా సంచరిస్తున్న ఒంటరి ఏనుగు ఏ క్షణాన గ్రామంలోకి చొరబడి దాడి చేస్తుందోనని భయంతో వణికిపోతున్నారు. ఏనుగుల కదలికలపై ఎప్పటికప్పుడు అటవీ శాఖ అధికారులు రైతులకు సమాచారం ఇవ్వాలని ఉన్నతాధికారులు ఆదేశించినా సంబంధిత అధికారులు మాత్రం సరైన సమాచారం ఇవ్వడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని వారు అధికారులను కోరుతున్నారు.

జూదరుల అరెస్ట్

గుర్ల: మండలంలోని పెనుబర్తి గ్రామ శివారులో పేకాట స్థావరంపై గుర్ల ఎస్సై హరిబాబు నాయుడు దాడి చేసి ఆరుగురు జూదరులను అరెస్ట్ చేయడంతో పాటు వారి నుంచి రూ.20750 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సోమవారం తెలిపారు. గ్రామాల్లో పేకాట, మద్యం అమ్మకాలు, ఇతర అసాంఘిక కార్యక్రమాలు చేపట్టిన వారి వివరాలు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

మంత్రిమండలి పునర్వ్యవస్థీకరణ!

- కేబినెట్‌లో కొత్త ముఖాలకు చోటు కల్పించే అవకాశం
- ఊహాలోకంలో మల్లగుల్లాలు పడుతున్న ఆశావహులు
- సీఎం నవీన్‌ను ప్రసన్నం చేసుకునే పనిలో మరికొందరు





సీఎం నవీన్ పట్నాయక్ మంత్రి ప్రమీలా మల్లిక్

భువనేశ్వర్: ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ త్వరలో మంత్రిమండలి పునర్వ్యవస్థీకరించే అవకాశం ఉంది. కేబినెట్ సభ్యుల పనితీరు సమీక్ష పట్ల ఆయన గురిపెట్టారు. సమీక్ష నివేదిక ఆధారంగా కొందరి తొలగింపు, మరికొందరికి పదవులు కట్టబెట్టే అవకాశాల పట్ల చర్చ జోరుగా సాగుతోంది. ఇటీవల స్పీకర్ విక్రమ కేశరిఅరూఖ్, మంత్రులు సమీర్ రంజన దాస్, శ్రీకాంతసాహు తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ ఏడాది జనవరి 27న ఆరోగ్య–కుటుంబ సంక్షేమశాఖ మంత్రి నవకిషోర్ దాస్ హత్య తరువాత మరోస్థానం ఖాళీ అయ్యింది. ఈ లెక్కన నవీన్ కేబినెట్‌లో(స్పీకర్ పదవి మినహాయించుకుని) 3 స్థానాలు ఖాళీ అయ్యాయి. వీటిని భర్తీ చేయడంతో పనితీరు సమీక్ష ఆధారంగా తొలగింపులు, శాఖల మార్పు, చేర్పులతో కొత్త ముఖాలకు స్థానం కల్పించే దిశలో చర్చ రసవత్తరంగా సాగుతోంది. ఇద్దరు రాత్రులు రాజీనామా చేయడంతో ఆ పదవుల బాధ్యతలను రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ విభాగం మంత్రి ప్రమీల మల్లిక్‌కు అదనంగా కేటాయించారు. స్పీకర్ అరూఖ్ కూడా రాజీనామా చేయగా.. వ్యక్తిగత కారణాలను సాకుగా చూపారు. మరోవైపు శ్రీకాంత సాహు, సమీర్ రంజనదాస్ బీజేడీ సంస్థాగత వ్యవహారాల్లో నిమగ్నమయ్యేందుకు రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు. వీరివురూ వివాదాలలో చిక్కుకున్నందున లోపాయికారంగా నిష్క్రమించేలా చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

గవర్నర్ రాక కోసం..

మంత్రిమండలి మార్పు చేర్పుల పట్ల ఊహాగానాలు ఊపందుకుంటున్న తరుణంలో గవర్నర్ ప్రొఫెసర్ గణేషీలాల్ రాష్ట్రంలో అందుబాటులో లేరు. ఆయన ప్రస్తుతం హర్యానాలో ఉన్నారు. మరోవైపు ఈ నెలలో మంత్రుల పనితీరు సమీక్ష కొలిక్కి రానుంది. ఈ నెల 22న గవర్నర్ తిరిగి రానున్నట్లు సమాచారం. ఆ సమయానికి మంత్రుల పని తీరు సమీక్ష ప్రక్రియ ఖరారైన మంత్రిమండలి పునర్వ్యవస్థీకరణకు రంగం సిద్ధం చేసే అవకాశం ఉంది.

అంతా ఆయన నిర్ణయమే..

ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ కోరుకున్నప్పుడు మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరుగుతుంది. శాఖల పంపిణీపై ఆయన నిర్ణయం తీసుకుంటారని రెవెన్యూ విపత్తు నిర్వహణ శాఖామంత్రి ప్రమీలా మల్లిక్ విలేకర్లకు సోమవారం తెలిపారు. దీపాలి దాస్ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన సందర్భంగా ఆమె మాట్లాడారు. 2024 సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా మంత్రిమండలిలో మహిళా ప్రాతినిధ్యం బలపరిచే అవకాశం ఉందన్నారు. త్వరలో జరగనున్న పునర్వ్యవస్థీకరణలో సరికొత్త ముఖం ఝార్సుగుడ నియోజకవర్గ ఎమ్మెల్యే దీపాలీ దాస్, కవిసూర్యనగర్ ఎమ్మెల్యే లతిక ప్రధాన్‌కు పదవులు వరించే అవకాశాల పట్ల సంకేతాలు జారీ చేశారు. శాసనసభలో మహిళా ఎమ్మెల్యేల సంఖ్య పెరిగింది. ఈ నేపథ్యంలో నిర్ణయం తీసుకునే ప్రక్రియలో మహిళలకు సముచిత స్థానం కల్పించాలని పార్టీ అధిష్టానం దీర్ఘ కాలంగా యోచిస్తోంది. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించి, బిజూ జనతాదళ్ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ వాగ్దానానికి పట్టంగట్టారు. పార్లమెంట్, అసెంబ్లీలలో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడంలో విముఖతపై కేంద్రప్రభుత్వం ఆది నుంచి వెనుకడుగు వేస్తోందని ఆమె వ్యాఖ్యానించారు.

మహిళల ఆదరణ అపురూపం..

2001లో మహిళల ఆధ్వర్యంలో స్వయం సహాయక బృందాల్ని మిషన్‌శక్తి కార్యక్రమం కింద ఒక తాటి పైకి తీసుకుని వచ్చిన సీఎం నవీన్.. వరుసగా ఘన విజయాలు సాధిస్తున్నారు. మహిళల ఏకీకృతం సూత్రంతో బీజేడీ దేదీప్యంగా వెలుగొందుతుంది. నవీన్ పట్నాయక్ విజయంలో రాష్ట్ర మహిళల ఓట్లు వాటా అధికం కావడమేనని ఈ సందర్భంగా ప్రమీలా మల్లిక్ అభిప్రాయం వ్యక్తంచేశారు. శనివారం విడుదలైన ఝార్సుగుడ నియోజకవర్గ ఉప ఎన్నిక ఫలితాలు వెల్లడై, పార్టీ అభ్యర్థి తిరుగులేని విజయం సాధించడంతో మంత్రిమండలి పునర్వ్యవస్థీకరణ వైపు ముఖ్యమంత్రి దృష్టి మళ్లించారు. స్పీకర్ రాజీనామాతో ఆయనకు మంత్రివర్గంలో స్థానం లభించడం పట్ల ఊహాగానాలకు ఆజ్యం పోసింది.

బిక్కుబిక్కుమంటున్న మంత్రులు..

కేబినెట్ పునర్వ్యవస్థీకరణ పురస్కరించుకుని సిట్టింగ్ మంత్రులు బిక్కుబిక్కుమంటున్నారు. గత ఏడాది జూన్‌లో చేపట్టిన మంత్రిమండలి పునర్వ్యవస్థీకరణ సందర్భంగా మొత్తం 20మంది మంత్రులతో రాజీనామా చేయించారు. అనంతరం భారీ మార్పు చేర్పులతో పునర్వ్యవస్థీకరించారు. ఆ సమయంలో వివాదాల్లో చిక్కుకున్న వారిని మంత్రి మండలి నుంచి తొలగించారు. ఈ జాబితాలో కెప్టెన్ దివ్యశంకర్ మిశ్రా, డాక్టరు అరుణ్‌కుమార్ సాహు, ప్రతాప్ జెనాలను మంత్రివర్గం నుండి తొలగింపు వేటుకు గురయ్యారు. ఈసారి ఎవరి పట్ల ఎటువంటి చర్యలు ఉంటాయోననే భయంతో మంత్రి మండలిలో సర్వత్రా భయాందోళనలు విస్తరించి ఉన్నాయి.

ముగిసిన రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలు



ప్రసంగిస్తున్న ఏడీఎం సోమనాథ్ ప్రధాన్, వేదికపై అతిథులు

- బెస్ట్ టీం చాంపియన్‌గా కొరాపుట్ జట్టు



తుది పోరులో తలపడుతున్న కొరాపుట్, రాయగడ క్రీడాకారులు

రాయగడ: స్థానిక గోవిందచంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో గత 2రోజులుగా కొనసాగుతున్న రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలు సోమవారం రాత్రి ముగిశాయి. జిల్లా అదనపు మేజిస్ట్రేట్ సోమనాథ ప్రధాన్ ముగింపు పోటీలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడా రంగానికి పెద్దపీట వేస్తోందని, క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో తమలో ఉన్న ప్రతిభను చాటుకునే విధంగా క్రీడాకారులు పోటీల్లో పాల్గొవాలని సూచించారు. రాయగడ జిల్లాలో ప్రథమంగా బాక్సింగ్ పోటీలు నిర్వహించడంపై హర్షం వ్యక్తంచేశారు. చిన్నారులు సైతం పోటీల్లో పాల్గొనడంపై అభినందించారు. ఇటువంటి పోటీలు నిర్వహించడంతో క్రీడాకారుల్లో మరింత ఉత్సాహం పెరుగుతుందని వివరించారు. గత 2రోజులుగా జరిగిన బాక్సింగ్ పోటీల్లో రాష్ట్రంలోని 18 జిల్లాలకు చెందిన 120మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కొరాపుట్ బృందం బెస్ట్ టీం చాంపియన్ ట్రోఫీ గెలుచుకుంది. అదేవిధంగా బరఘడ్ జిల్లా బెస్ట్ టీం రన్నర్‌గా నిలిచాయి. బెస్ట్ టీం డిసిప్లెన్‌గా కేంజొహర్, రాయగడకు బెస్ట్ టీం ఆర్గనైజర్‌గా బహుమతులు లభించాయి. పోటీల్లో గెలుపొందిన వారు త్వరలో చెన్నైలో జరగనున్న జాతీయస్థాయి బాక్సింగ్ పోటీల్లో రాష్ట్రం తరపున పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి చెందిన డాక్టర్ మమత చౌధరి, మమత దాస్, డాక్టర్ డీకే, సెంచూరియన్ విశ్వవిద్యాలయం డైరెక్టర్ రాజేష్ పాఢి తదితరులు పాల్గొన్నారు.

దోపిడి దొంగల అరెస్ట్

- 38.29 గ్రాములు బంగారం స్వాధీనం చేసుకున్న పోలీసులు
- 17 సెల్‌ఫోన్లు, 2 తుపాకీలు, 5 బైక్‌లు స్వాధీనం



విలేకర్లతో మాట్లాడుతున్న ఎస్పీ వివేక్

బరంపురం: గత కొద్ది రోజులుగా గంజాం జిల్లా పోలీసు పరిధిలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన దోపిడీలకు సంబంధించి ఏడుగురు నిందితులను అరెస్ట్ చేశామని బరంపురం ఎస్పీ సరవణ్ వివేక్ వెల్లడించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్పీ కార్యాయంలో ఆదివారం సాయంత్రం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో చోటు చేసుకున్న దోపిడీ ఘటనల్లో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈ మేరకు విచారణ చేపట్టిన పోలీసులు.. ఏడుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. పూర్తి ఆధారాలు సేకరించిన అనంతరం వారి నుంచి 38.29 గ్రాముల బంగారం, 17 సెల్‌ఫోన్లు, 2 తుపాకీలు, 5 బైక్‌లు, మారణాయుధాలు, రూ.3,450ల నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను గుర్తించడంలో కీలకంగా వ్యవహరించిన ప్రత్యేక పోలీసు బృందాన్ని అభినందించారు. అరెస్టయిన వారిలో గోపాల్‌పూర్, దిగపండి, సదర్, నిమ్మఖండి, గుసానినువాగాం, ఛత్రపూర్ పోలీసు స్టేషన్‌ల పరిధిలోని సుకాంత్‌కుమార్ సాహు, సుకదేవ్ సాహు, సుమన్ చౌధురి, పింకు సాహు, కిషన్ సాహు, సాగర్ సాహు, ఓ మైనర్ ఉన్నట్లు ఎస్పీ వివరించారు.



పోలీసుల అదుపులో నిందితులు, రికవరీ చేసిన సొత్తు

మర్రిమానుగూడలో చోరీ

సీతంపేట: మండలంలోని దోనుబాయి పోలీస్‌స్టేషన్ పరిధి మర్రిమానుగూడ గ్రామంలో ఒక ఇంట్లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. గ్రామానికి చెందిన పూయక సోమయ్య మండు వేసవి కావడం, రాత్రి సమయంలో ఉక్కపోత ఎక్కువగా ఉండడంతో ఇంటికి తాళం వేసి ఆరుబయట కుటుంబసభ్యులతో కలిసి పడుకున్నారు. ఇదే అదునుగా ఇంటి వెనుక భాగంలో ఉన్న కిటికీని తొలగించి ఇంట్లోకి దొంగలు చొరబడ్డారు. తన అవసరాల నిమిత్తం దాచుకున్న సుమారు రూ.లక్షా 70 వేలు, మూడు తులాల బంగారం బీరువా తాళాలు పగులగొట్టి చోరీ చేసినట్లు బాధిత కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పాలకొండ సీఐ మురళీధర్ కేసు నమోదు చేశారు.

వినతుల పరిష్కారానికి చర్యలు

పర్లాకిమిడి: గుసాని సమితి సర్దాపూర్ పంచాయతీ భారత్ నిర్మాణ్ రాజీవ్‌గాంధీ సేవాకేంద్రంలో జిల్లా అదనపు మేజిస్ట్రేట్ రాజేంద్ర మింజ్ ఆధ్వర్యంలో సోమవారం జాయింట్ గ్రీవెన్స్‌సెల్ ప్రారంభించారు. గ్రీవెన్స్‌లో జిల్లా ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, సబ్ డివిజనల్ పోలీసు అధికారి రామకృష్ణపతి, అధికారులు పాల్గొన్నారు. గ్రీవెన్స్‌కు గుసాని సమితిలోని సర్దాపురం పంచాయతీ పరిధి బాగుసల, పెద్దగుసాని, అగరఖండి గ్రామాలకు చెందిన ప్రజల నుంచి 35 వినతులు స్వీకరించారు. వీటిలో గ్రామ సమస్యలపై 9 ఉన్నాయి. 5 వినతులను అధికారులు అక్కడికక్కడే పరిష్కరించారు. అలాగే 17మందికి వృద్ధాప్య మధుబాబు పింఛన్లు ఆమోదించారు. దీనితో పాటు భూపట్టాలు, గృహ నిర్మాణాలు, రేషన్ కార్డులు, విద్య, రోడ్డు, సాగునీటి పథకాలపై వినతులు అందాయి. గ్రీవెన్సుకు గుసాని సమితి అధ్యక్షుడు ఎన్.వీ రాజు, సీడీఎంఓ డాక్టర్ పాత్రొ, బీడీఓ నీలమాధవ మాఝి, తహసీల్దార్ నారాయణ బెహరా, జిల్లాస్థాయి ప్రభుత్వ అధికారులు హాజరయ్యారు.



రాయగడ: వినతులు స్వీకరిస్తున్న అధికారులు

రామనగుడలో గ్రీవెన్స్..

రాయగడ: జిల్లాలోని రామనగుడ పంచాయతీ సద్భావన సమావేశ మందిరంలో వినతుల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా యంత్రాంగం నిర్వహించింది. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ రవినారాయణ త్రిపాఠి, జిల్లా అదనపు మేజిస్ట్రేట్ సోమనాథ్ ప్రధాన్, గుణుపూర్ సబ్ కలెక్టర్ లలిత్‌కుమార్ కుహారో, జిల్లా ముఖ్యవైద్యాధికారి డాక్టర్ లాల్‌మోహన్ రైత్రాయ్, ఐటీడీఏ అధికారి ప్రభాతి జొడియా తదితరులు హాజరయ్యారు. రామనగుడ సమితి పరిధిలోని మొత్తం 13 వినతులను అధికారులు స్వీకరించగా.. ఇందులో 10 వ్యక్తిగతమైనవి, మరో 3 గ్రామ సమస్యలుగా గుర్తించారు. వీటిని సకాలంలో పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులను ఏడీఎం ఆదేశించారు.



వినతులు స్వీకరిస్తున్న ఏడీఎం రాజేంద్ర మింజ్



గ్రీవెన్స్‌కు హాజరైన ప్రభుత్వ అధికారులు

కల్యాణ మండపానికి భూమి పూజ

గరుగుబిల్లి: తోటపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో రూ.కోటి వ్యయంతో నిర్మించే శ్రీనివాస కల్యాణ మండపం నిర్మాణానికి విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎల్.వి.సుబ్రహ్మణ్యం, ఇన్‌చార్జి జేసీ విష్ణుచరణ్ సోమవారం భూమిపూజ చేశారు. ముందుగా వేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవార్లను దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకుడు అప్పలాచార్యులు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం బలిజేపల్లి లక్ష్మీకాంత విరచిత 'సత్యహరిశ్చంద్రీయం' పద్యనాటక సహిత ప్రతిపదార్థ తాత్పర్యంలతో ముప్పల వెంకటరమణ రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం ఈఓగా పనిచేసి స్వామివారి సేవ చేసుకునే భాగ్యం కలిగిందన్నారు. ప్రజల్లో భక్తిభావం పెంపొందించేందుకు కృషిచేయాలని తోటపల్లి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులను కోరారు. టీటీడీ సేవాట్రస్టు అధ్యక్షుడు డి.ధనుంజయరావు, యడ్ల గోపాలరావు, జట్టు ట్రస్టీ డి.పారినాయుడు తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాస కల్యాణ మండపం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న విశ్రాంత ఐఏఎస్ ఎల్.వి.సుబ్రహ్మణ్యం, ఇన్‌చార్జి జేసీ విష్ణుచరణ్ తదితరులు

217 మద్యం సీసాల పట్టివేత

గుర్ల: మండలంలోని వల్లాపురంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని గుర్ల ఎస్సై హరిబాబు నాయుడు సోమవారం అరెస్ట్ చేసి 217 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో మద్యం అమ్మకాలు జరుపుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి నిందితుడిని అరెస్ట్ చేయడంతో మద్యం సీసాలను సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని, గ్రామాల్లో బెల్ట్ షాపుల ద్వారా మద్యం అమ్మకాలు చేపడితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జామిలో 40 మద్యం బాటిల్స్..

జామి: అక్రమంగా మద్యం అమ్మకాలు సాగిస్తున్నారన్న సమాచారం అందడంతో ఎస్సై వీరబాబు సిబ్బందితో కలిసి సోమవారం భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ వద్ద నిఘా వేశారు. జామికి చెందిన పిన్నింటి అప్పారావు 40 మద్యం బాటిల్స్ కలిగి ఉండడంతో స్వాధీనం చేసుకుని నిందితుడిని ఎస్.కోట న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఈ మేరకు న్యాయమూర్తి నిందితుడికి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

గుర్ల: మండలంలోని తాటిపూడిలో అక్రమంగా నిల్వ ఉంచిన 22 బస్తాల పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు సోమవారం పట్టుకున్నారు. పీడీఎస్ బియ్యం నిల్వ చేసిన తాటిపూడి గ్రామానికి చెందిన కిరాణా షాపు యాజమాని కుసుమంచి మహేశ్వరరావుపై 6ఎ కేసు నమోదు చేసినట్లు సీఎస్‌డీటీ శోభ తెలిపారు.

కుమిలిలో 350 కిలోలు..

పూసపాటిరేగ : మండలంలోని కుమిలి గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని సీజ్ చేసినట్లు సీఎస్‌డీటీ మురళి సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన పైడిపల్లి సూర్యనారాయణ ఇంట్లో నిల్వ ఉంచిన 350 కేజీల బియ్యం స్వాధీనం చేసుకుని 6ఎ కేసు నమోదు చేసినట్లు చెప్పారు. దాడుల్లో విజిలెన్స్ సీఐ సింహాచలం, కానిస్టేబుల్ పురుషోత్తం , రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీటి వెతలు తీర్చేలా..

తోటపల్లి పనులు

- రూ.132 కోట్ల వ్యయంతో తోటపల్లి ప్రాజెక్టు మిగులు పనులు
- రూ.80 కోట్లతో కాలువల నిర్మాణం
- లస్కర్ల నియామకానికి జలవనరుల శాఖ ప్రతిపాదనలు

బొబ్బిలి:

తోటపల్లి ప్రాజెక్టు... విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల రైతులకు సాగునీటి ఆదరువు. ప్రాజెక్టులో నీరు సమృద్ధిగా ఉన్నా పిల్లకాలువలు నిర్మించకపోవడం, మదుముల మరమ్మతులు, పూడికపోయిన కాలువలతో ఏటా సాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. రైతుల సమస్యను గుర్తించిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రాజెక్టు మిగులు పనులపై దృష్టి సారించింది. బడ్జెట్‌లో రూ.132 కోట్లు కేటాయించింది. దశలవారీగా ప్రాజెక్టు ఆధునికీకరణ పనులు పూర్తిచేస్తోంది. ప్రస్తుతం పిల్లకాలువల పనులు చకచకా సాగుతున్నాయి. ప్రస్తుతం ప్రాజెక్టు నుంచి 82వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది.

పనులు పూర్తయితే సుమారు 2 లక్షల ఎకరాలకు సమృద్ధిగా సాగునీరు అందనుంది. వచ్చే ఖరీఫ్‌కు పూర్తిస్థాయి ఆయకట్టుకు సాగునీరు అందించడమే లక్ష్యంగా జలవనరులశాఖ అధికారులు పనులు జరిపిస్తున్నారు.



బొబ్బిలి-బలిజిపేట మండలాల మధ్య తోటపల్లి కాలువ


లస్కర్ వ్యవస్థకు నీళ్లొదిలిన గత ప్రభుత్వం

సాగునీటి ప్రాజెక్టుల నుంచి ఆయకట్టుకు సక్రమంగా సాగునీరు అందేలా చూడడం.. కాలువల పర్యవేక్షణ.. మదుముల నిర్వహణ.. అడ్డంకులు తొలగించడంలో లస్కర్లది కీలకపాత్ర. గత ప్రభుత్వం లస్కర్ల నియామకానికి నీళ్లొదిలింది. మూడు జిల్లాలకు సాగునీరు అందించే తోటపల్లి ప్రాజెక్టు పనులపై శీతకన్నువేసింది. ప్రస్తుత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల ఆధునికీకరణతో పాటు లస్కర్ల నియామకానికి చర్యలు చేపట్టింది. దీంతో రూ.79లక్షల వ్యయంతో జలవనుల శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. దీంతో రైతన్నల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. సాగునీటి కష్టాలు దూరమవుతాయన్న భావిస్తున్నారు. సాగునీటి వృథాకు అడ్డుకట్ట పడుతుందని ఆశిస్తున్నారు.

ప్రతిపాదనలు సిద్ధం

ఇటీవల మంత్రి బొత్స సత్యనారాయణ, జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు కలిసి ఎమ్మెల్యేలతో విజయనగరం జిల్లా కేంద్రంలో సమావేశమయ్యారు. ఇందులో లస్కర్ల నియామకంపై చర్చించారు. ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జలవనరులశాఖ అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో తాత్కాలిక ప్రాతిపదికన లస్కర్లను నియమిస్తే వారికి చెల్లించే జీతభత్యాలకు రూ.79 లక్షల వ్యయం అవుతుందని ప్రతిపాదనలు తయారుచేసి ప్రభుత్వానికి పంపించారు. ఇవి త్వరలో మంజూరయ్యే అవకాశం ఉంది.

ప్రతిపాదనలు పంపించాం



రెండు జిల్లాల పరిధిలోని లస్కర్ల నియామకానికి ప్రతిపాదనలు పంపించాం. మంజూరైన వెంటనే తోటపల్లి కుడికాలువ చింతాడ, పక్కి, గంగన్నపాడు, లావేరు, పూసపాటిరేగ ప్రాంతాల మీదుగా సాగునీటి సరఫరా పర్యవేక్షణకు లస్కర్లను నియమిస్తాం. దీనివల్ల సాగునీరు వృథా కాదు. రైతుల మధ్య తగాదాలు, గొడవలు తలెత్తవు. లస్కర్లు చివరి ఆయకట్టు వరకూ సాగునీరు అందేలా పర్యవేక్షిస్తారు. లోటుపాట్లను అధికారులకు తెలియజేస్తారు. దీని వల్ల రైతాంగం సమస్యల్లేకుండా పంటలు సాగు చేసుకోవచ్చు.

– రామచంద్రరావు, ఈఈ, తోటపల్లి జలాశయం



బొబ్బిలి మండలం పిరిడి వద్ద పిల్ల కాలువ నిర్మాణ పనులు

క్లుప్తంగా

21 టన్నుల పీడీఎస్ బియ్యం పట్టివేత



స్వాధీనం చేస్తున్న బియ్యం బస్తాల వద్ద విజిలెన్స్ సిబ్బంది

కోటబొమ్మాళి: చీపుర్లపాడు పంచాయతీ దుర్గంపేటలోని శ్రీవసంతలక్ష్మి మోడరన్ రైస్ మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన 21.290 టన్నుల (432 ప్యాకెట్లు) పీడీఎస్ బియ్యాన్ని శ్రీకాకుళం విజిలెన్సు అండ్ పౌరసరఫరాల అధికారులు సోమవారం దాడిచేసి పట్టుకున్నారు. మిల్లు యజమాని బోయిన కృష్ణారావుపై కేసు నమోదుకు కోటబొమ్మాళి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు విజిలెన్స్ సీఐ ఆర్.అప్పలనాయుడు తెలిపారు. పట్టుబడిన బియ్యాన్ని కోటబొమ్మాళిలోని లక్ష్మీగణపతి రైస్‌మిల్లులో భద్రపరిచామన్నారు. దాడుల్లో సీఎస్‌డీటీ కె.రాము, విజిలెన్స్ హెడ్ కానిస్టేబుళ్లు కెల్లి అప్పన్న, రామ్మోహన్, కానిస్టేబుళ్లు రమేష్, లక్ష్మీనారాయణ, మురళి ఉన్నారు.

ద్విచక్ర వాహన షోరూంలో అగ్ని ప్రమాదం

శ్రీకాకుళం రూరల్: పెదపాడు పరిధిలో ఉన్న ఓ ద్విచక్ర వాహన షోరూంలో సోమవారం ఉదయం స్వల్ప అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో రూ.50 వేలు విలువ చేసే స్క్రాప్ ధ్వంసమైంది. షోరూం మేడమీద పూజ గది నుంచి దీపం వత్తులు కిందపడంతో మంటలు వ్యాపించడంతో ప్రమాదం జరిగినట్టు భావిస్తున్నారు. ఆస్తినష్టం కొంతమేరకు జరిగిందని అగ్నిమాపక కేంద్రం సహాయ అధికారి వరప్రసాదరావు తెలిపారు.

ఎస్పీ స్పందనకు 42 ఫిర్యాదులు



ఫిర్యాదుదారుల గోడు వింటున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : స్పందన కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులను చట్టపరిధిలో పరిష్కరించి నిర్ణీత సమయంలోగా బాధితులకు న్యాయం జరిగేలా చూడాల ని ఎస్పీ జీఆర్ రాధిక అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జగనన్నకు చెబుదాం స్పందన గ్రీవెన్సుకు వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ ముఖాముఖి మాట్లాడారు. అర్జీదారుల నుంచి మొత్తం 42 ఫిర్యాదులు స్వీకరించి క్షుణ్ణంగా పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చూ స్తానని భరోసా ఇచ్చారు. ఏదైనా సమస్య ఉంటే గ్రీవెన్సు హెల్ప్‌లైన్ నంబర్ 1902కు ఫిర్యాదు చేయా లని సూచించారు. కార్యక్రమంలో ఎస్పీతో పాటు స్పెషల్ ఎన్ఫోర్సుమెంటు బ్యూరో జేడీ వి.ఎన్.మణికంఠ, అదనపు ఎస్పీ టీపీ విఠలేశ్వరరావు ఉన్నారు.

చెరువు గర్భాల ఆక్రమణపై ఫిర్యాదు



తహసీల్దార్ కిరణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

రణస్థలం: పైడిభీమవరం రెవెన్యూలోని సర్వే నంబర్ 32లో 19 ఎకరాల గుండం చెరువు, దేవునిపాలవలస రెవెన్యూలోని సర్వే నంబర్ 28లో 13.28 ఎకరాలు సుబ్బమ్మ చెరువు గర్భాలు ఆక్రమణకు గురయ్యాయని..వాటిని తొలగించాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ సనపల కిరణ్‌కుమార్‌కు దేవునిపాలవలస గ్రామానికి చెందిన బి.అప్పలనరసయ్య, ఎంఏఎస్ నారాయణ, ఎం.రామచంద్రరావు తదితరులు సోమవారం ఫిర్యాదు చేశారు. చెరువుల ఆక్రమణతో గ్రామ ప్రజలు, పశువులు, మేకలకు మంచినీరు లభ్యంకాని పరిస్థితి నెలకొందన్నారు. భూగర్భ జలాలు అడుగంటిపోయి జలవనరులకు ప్రమాదం ఏర్పడిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. చెరువులను పరిశీలించి తగు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని తహసీల్దార్ కిరణ్‌కుమార్ వద్ద ప్రస్తావించగా చెరువులు భూముల రికార్డుల ప్రాప్తికి జీరాయితీగా చూపిస్తోందన్నారు. చెరువుల కింద ఆయకట్టు ఉందేమోనని ఇరిగేషన్ అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాల్సి ఉందని చెప్పారు.

వడదెబ్బ తగిలి వ్యక్తి మృతి

కాశీబుగ్గ: పలాసలో సోమవారం 37 డిగ్రీల ఉష్ణోగ్రతకు తట్టుకోలేక ఒక వ్యక్తి మృతి చెందారు. వివరాల్లోకి వెళితే.. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 16వ వార్డుకు చెందిన శ్రీనివాసనగర్ వాసి సుంకరి సింహాచలం (39) తన భార్యతో గొడవపడి గతనాలుగు రోజులుగా ఇంటికి రాకుండా బయట తిరుగుతున్నారు. అయితే సోమవారం ఆయన మద్యం మత్తులో ఉండడం, ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ఆరుబయట పడిపోయి మరణించాడని కాశీబుగ్గ పోలీసులు నిర్ధారించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కాశీబుగ్గ రూరల్ సీఐ శంకరరావు తెలిపారు.

స్త్రీనిధి.. ప్రగతికి పెన్నిధి

- స్త్రీ నిధి రుణాలతో మహిళలకు ఆర్థిక చేయూత
- ఒక్కో గ్రూపునకు రూ. 4.50 లక్షల రుణం
- ఎలాంటి హామీ లేకుండా 48 గంటల్లో మంజూరు



మహిళా సభ్యులు (ఫైల్)

జి.సిగడాం: స్త్రీ నిధి మహిళల పాలిట పెన్నిధిగా మారుతోంది. పల్లెల్లోని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం ఈ పథకం ద్వారా సహాయం చేస్తోంది. పొదుపు సంఘాల్లో ఉన్న సభ్యులైన మహిళలకు స్త్రీ నిధి ద్వారా జీవనోపాధుల కోసం రుణాలు అందిస్తూ అండగా నిలుస్తున్నారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా అర్హతే ప్రామాణికంగా రుణాలు మంజూరు చేస్తుండడంతో మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. తీసుకుంటున్న రుణాలను మహిళా సంఘాల సభ్యులు వాటిని సక్రమంగా వినియోగించుకుంటూ ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. కొందరు తమ పిల్లల ఉన్నత విద్య కోసం, మరి కొందరు ఆడపిల్లకు వివాహం కోసం ఈ డబ్బును వాడుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా సుమారుగా 5 లక్షల మంది సభ్యులు ఉండగా వీరిలో 45 వేల మంది వరకు స్త్రీనిధి కింద రుణాలను తీసుకుని ఆనందంగా జీవిస్తున్నారు.

లక్ష్యాలు ఇలా..



జిల్లాలో 2021-2022 ఆర్థిక సంవత్సరంలో రూ.165 కోట్లు, 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.167 కోట్లు లక్ష్యం ఇచ్చారు. వీటిని అధిగమించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.167 కోట్లను లక్ష్యంగా నిర్ధారించగా.. ఇప్పటికే రూ.25 కోట్ల మేర రుణాలను అందించారు. స్త్రీ నిధి రుణాలు అవసరమైన సభ్యులు గ్రామ వీఏలకు సమాచారం అందిస్తే 48 గంటల్లోనే రుణాలను సంబంధిత బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నారు. రుణం తీసుకున్న సభ్యులందరికీ సురక్షిత బీమా పథకం కూడా అమలు చేస్తున్నారు.

అప్పుడు అలా.. ఇప్పుడు ఇలా..

టీడీపీ హయాంలో గ్రూపులో ఉన్న ఐదుగురు సభ్యులను మాత్రమే ఎంపిక చేసి ఒక్కొక్కరికి రూ.20వేలు మాత్రమే ఇచ్చేవారు. అది కూడా తమ అనుయాయులకే అందజేసేవారు. మిగతా గ్రూపు సభ్యులకు ఏ కష్టం వచ్చినా పట్టించుకునేవారు కాదు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మహిళల సంక్షేమానికి పెద్ద పీట వేశారు. ఒక్కో గ్రూపునకు రూ.4.50 లక్షల చొప్పున స్త్రీ నిధి రుణాలు మంజూరు చేస్తున్నారు. అర్హులైన సభ్యులకు అవసరాలను బట్టి రుణాలను అందిస్తున్నారు. అది కూడా సంబంధిత వీఏలకు సమాచారం ఇస్తే 48 గంటల్లోనే రుణాలను సభ్యుల ఖాతాల్లో జమ చేస్తున్నారు.

గ్రేడ్‌ల ఆధారంగా..



గ్రామైక్య సంఘాలను పరిగణనలోకి తీసుకుని రుణాలను మంజూరు చేస్తున్నారు. ఏ గ్రేడ్‌కు రూ.75 లక్షలు, బి గ్రేడ్‌కు రూ.65 లక్షలు, సి గ్రేడ్‌కు రూ.55 లక్షలు, డి గ్రేడ్‌కు రూ.45 లక్షల చొప్పున రుణాలను అందజేస్తున్నారు.



అందరూ వినియోగించుకుంటున్నారు



మహిళల జీవితాల్లో జగనన్న మరిన్ని వెలుగులు నింపుతున్నారు. వీటిలో స్త్రీ నిధి రుణాలు అంతా వినియోగించుకుంటున్నారు. వ్యాపారాలకు కొందరు, పెళ్లిళ్లకు మరికొందరు ఈ డబ్బును వాడుకుంటున్నారు. మా మహిళల పాలిట దేవుడు సీఎం వైఎస్ జగనన్న.

– వాన ప్రమీలరాణి, ఎంఎంఎస్ అధ్యక్షురాలు, జి.సిగడాం

లక్ష్యానికి మించి..



ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాన్ని మించి స్త్రీ నిధి రుణాలను మంజూరు చేస్తున్నాం. గత ఏడాది రూ.167 కోట్లు లక్ష్యం కాగా రూ.171 కోట్లు అందించాం. పైసా ఖర్చులేకుండా 48 గంటల్లోనే రుణాలను మంజూరు చేస్తున్నాం.

– వాక సత్యనారాయణ, స్త్రీనిధి, ఏజీఎం, శ్రీకాకుళం

'సంతృప్తి స్థాయి' పెరగాలి



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

- 'జగనన్నకు చెబుదాం' సమస్యలు పరిష్కరించాలి
- కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: 'జగనన్నకు చెబుదాం' ద్వారా నమోదైన సమస్యల పరిష్కారంలో అర్జీదారుల సంతృప్తి స్థాయి పెరగాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. ఆయన సోమవారం కలెక్టర్ కార్యాలయ వీడియో సమావేశ మందిరంలో స్పందన, ఏపీ పోర్టల్ సేవ, జగనన్నకు చెబుదాంపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్ ఇటీవల లాంఛనంగా ప్రారంభించారని, నాటి నుంచి నేటి వరకు జిల్లాలో 88 ఫిర్యాదులు అందాయన్నారు. వాటిలో 82 మందికి కాల్స్ వెళ్లగా, వారిలో 51 మంది స్పందించారని తెలిపారు. 14 మంది మాత్రమే సంతృప్తి చెందినట్లు చెప్పారని, మిగిలిన సమస్యలు కూడా పరిష్కరించాలన్నారు. ఇకపై వారంలో ఒక రోజు మండల స్థాయి బృందంలోని అధికారులందరూ సమావేశమై అర్జీదారుల సమస్యలు పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాస్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై ఇకపై ప్రతి బుధవారం సమీక్షిస్తామని, వచ్చే వారం నుంచి సంతృప్తి స్థాయి పెరగని సంబంధిత మండల అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. 1902 నంబరుకు ఫిర్యాదులు వెళ్లాయంటే అధికారుల అలసత్వమే కారణమన్న సంగతిని గ్రహించాలని అన్నారు.

స్పందనకు 180 అర్జీలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్పందన కార్యక్రమానికి హాజరు కాని అధికారులపై కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ సోమవారం స్పందన హాల్‌లో ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పందన కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, దీంతో పాటు 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం కూడా అమలు చేస్తోందని, సమస్య పరిష్కారంపై నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్పందన కార్యక్రమంలో స్వీకరించే ప్రతి దరఖాస్తును 24 గంటల్లో ఓపెన్ చేసి పరిష్కరించడమా లేదా తిరస్కరించడమా అనే అంశాలపై వివరణ ఇవ్వాలని సూచించారు. ఈ వారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందనలో 180 మంది అర్జీదారులు తమ సమస్యలపై కలెక్టర్‌కు దరఖాస్తులు అందజేశారు.



స్పందనలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జేసీ తదితర అధికారులు

నేడు రణస్థలంలో 'జాగృతి-యువత కోసం'



మాట్లాడుతున్న ఎస్సై రాజేష్

రణస్థలం: యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ సన్మార్గంలో నడిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'జాగృతి-యువత కోసం' కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని దేవిశ్రీ కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహిస్తున్నట్టు జె.ఆర్.పురం ఎస్సై జి.రాజేష్ తెలిపారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. 18 నుంచి 25 ఏళ్ల మధ్య వయసు ఉన్న యువకులు గంజాయి, మద్యం, చెడు వ్యసనాలకు బానిసై ఎలా నష్టపోతున్నారు, అనారోగ్య సమస్యలు ఎలా ఉత్పన్నమౌతున్నాయో ఈ కార్యక్రమంలో వివరిస్తామన్నారు. ఐదు రోజుల పాటు మండల యువతకు శిక్షణ ఇస్తామన్నారు. జాగృతి కార్యక్రమం వలన యువత కానిస్టేబుల్, ఆర్మీ, నేవీ వంటి ఉద్యోగాల వైపు దృష్టి సారించేలా కృషి చేస్తామన్నారు. ఇప్పటి వరకు రణస్థలం మండల వ్యాప్తంగా 500 మంది యువత జె.ఆర్.పురం పోలీస్ స్టేషన్‌లో పేర్లు నమోదు చేసుకున్నారని చెప్పారు.

జోరుగా నిషేధిత గుట్కాల అమ్మకం!



పోలీసులు స్వాధీనం చేసుకున్న గుట్కా బస్తాలు (ఫైల్)

టెక్కలి రూరల్: గుట్కా, ఖైనీవంటి మత్తు పదార్థాలను ప్రభుత్వం నిషేధించింది. అయితే పక్క రాష్ట్రాల నుంచి జిల్లాలోకి కొంతమంది వ్యక్తులు అక్రమ మార్గంలో తీసుకొని వచ్చి విక్రయాలు చేస్తున్నారు. పోలీసులు తరచూ దాడులు చేసి అక్రమార్కులను పట్టుకొని కేసులు నమోదు చేస్తున్నా వారిలో మార్పు రావడం లేదు. టెక్కలిలో నిషేధిత మత్తు పదార్థాలైన గుట్కా, ఖైనీ విక్రయాలు, రవాణా యథేచ్ఛగా జరుగుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి. గత నెల 25వ తేదీన టెక్కలిలో పోలీసులు దాడులు చేసి రూ. 2.70 లక్షల విలువైన గుట్కాను స్వాధీనం చేసుకున్నారు. ఈ సమయంలో సంబంధిత వ్యాపారి పోలీసులతో వాగ్వాదానికి దిగాడు. తనకు గుట్కా అమ్ముకునే హక్కు ఉందని, అన్ని బిల్లులు తన వద్ద ఉన్నాయని పోలీసులతో వాదించారు. దీంతో సరైన బిల్లులు లేవని పోలీసులు ఆ సరుకును స్టేషన్‌కు తరలించి కేసునమోదు చేశారు.

కుదిరిన వేతన ఒప్పందం



చర్చల్లో పాల్గొన్న పీసీఎంఏ అధ్యక్షుడు మల్లా సురేష్, కార్మికులు, పరిశ్రమదారులు

- జీడి కార్మికులు, పరిశ్రమదారుల మధ్య చర్చలు సఫలం
- 13 శాతం వేతనం పెంచేందుకు ఇరువర్గాల అంగీకారం

కాశీబుగ్గ: జీడి కార్మికులు, పరిశ్రమదారుల మధ్య జరిగిన చర్చలు సఫలమయ్యాయి. కార్మికుల రోజువారి వేతనాలపై జరిగిన చర్చలు సోమవారం కొలిక్కివచ్చాయి. 13 శాతం వేతనం పెంచేందుకు ఇరువర్గాలు అంగీకరించాయి. పలాస క్యాష్యూ మ్యాన్‌ఫాక్చర్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన చర్చల్లో పీసీఎంఏ కార్యవర్గ సభ్యులు, క్యాష్యూ, రైస్ మిల్లర్స్ కార్మికుల అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఇటీవల జరిగిన తొలి విడత చర్చలు విఫలయ్యాయి. అయితే రెండో విడత చర్చల్లో ఇరువర్గాలు ఓ అంగీకారానికి వచ్చాయి. రెండు సంవత్సరాలకు (2023-25) 13 శాతం వేతనాన్ని పెంచేందుకు ఇరువర్గాలు అంగీకారం తెలపడంతో సయోధ్య కుదిరింది. ప్రతీ రెండేళ్లకు జీడి కార్మికులకు, యాజమాన్యానికి మధ్య వేతన ఒప్పందం జరగడం ఆనవాయితీ. ఈ సమయంలో ధర్నాలు, నిసనలతో జరిగేవని.. ప్రస్తుతం అందరూ ఒకతాటిపైకి రావడం సంతోషంగా ఉందని పలువురు వ్యాఖ్యానించారు. కార్మిక సంఘ అధ్యక్షుడు బొంపల్లి సింహాచలం మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలు పరిష్కరించి వారికి అవసరమైన వసతులు ఏర్పాటు చేసి వారి జీవనమనుగడకు ఇబ్బంది కలుగకుండా చూడాలని కోరారు. పీసీఎంఏ అధ్యక్షుడు మల్లా సురేష్ మాట్లాడుతూ.. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సహకారంతో అన్నివిధాలుగా శాంతియుత చర్చలు జరిగాయని అన్నారు. లింగరాజు మాస్టారుకు సహకరించిన ఇరువర్గాల పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు. కార్మిక నాయకులు అంబటి కృష్ణమూర్తి, బొమ్మాళి తాతయ్య, కేవీ శివక్రిష్ణ, ఆర్.రవికాంత్ పాల్గొన్నారు.

ఆరు తులాల బంగారం చోరీ

ఇచ్ఛాపురం రూరల్: ఆరు తులాల బంగారంతో పాటు కొంతనగదు చోరీకి గురైందని ఫిర్యాదు అందినట్టు స్థానిక పోలీసులు తెలిపారు. సన్యాసిపుట్టుగలో ఆదివారం అర్ధరాత్రి ఓ ఇంట్లో చోరీ జరిగినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి వెళ్లి విచారించామని రూరల్ ఎస్ఐ వి.రమేష్ సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. అంబటి దేవి, ఆయన కుటుంబ సభ్యులు ఆదివారం రాత్రి ఇచ్ఛాపురం సంబరాలకు వెళ్లి అర్ధరాత్రి తరువాత ఇంటికి రాగా తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించారు. బెడ్‌రూంలోని బీరువా తెరిచి ఉండడం గ్రహించిన కుటుంబ సభ్యులు ఆరు తులాల బంగారం చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించినట్టు చెప్పారు. క్లూస్ టీమ్‌ను తీసుకొని సంఘటనా స్థలాన్ని పరిశీలించామన్నారు. బంగారం చోరీ విషయంలో అనుమానాలు ఉన్నాయన్నారు. సుమారు రూ. రెండు లక్షల వరకు నగదు కూడా పోయినట్లు బాధితులు చెబుతున్న నేపథ్యంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న పోలీసులు


'యంత్రాలతో పని సులభం'



కొబ్బరి రైతులకు చెట్లు ఎక్కే యంత్రాలను అందిస్తున్న జిల్లా ఉద్యానవన శాఖాధికారి ఆర్‌వీవీ ప్రసాద్

ఆమదాలవలస: యంత్ర సహాయంతో కొబ్బరి చెట్లు ఎక్కడం సులభతరమని, దీని ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ కాయలు దించుకోవచ్చని జిల్లా ఉద్యానవన శాఖాధికారి ఆర్‌వీవీ ప్రసాద్ సూచించారు. ఆమదాలవలస పట్టణంలోని కృషివిజ్ఞానకేంద్రంలో కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అధ్యక్షతన కొబ్బరి రైతులకు యాంత్రీకరణ పద్ధతులపై శిక్షణ కార్యక్రమాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. రైతులు యాంత్రీకరణ పద్ధతులు అవలంబించాలని సూచించారు. ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ వి.హరికుమార్ కొబ్బరిపంటలో యాజమాన్య పద్ధతులను వివరించారు. కొంత మంది కొబ్బరి రైతులకు చెట్లు ఎక్కే యంత్రాల ను అందించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

నేడు అండర్-19 ఎస్‌జీఎఫ్ జూడో ఎంపిక పోటీలు



శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్కూల్ గేమ్స్ అండర్-19 బాలబాలికల జూడో ఎంపిక పోటీలు మంగళవారం జరగనున్నాయి. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని కోడిరామ్మూర్తి స్టేడియం ప్రాంగణం వేదికగా ఈ నెల 16వ తేదీన ఉదయం 9 గంటల నుంచి ఈ ఎంపిక పోటీల ప్రక్రియ మొదలుకానుందని ఎస్‌జీఎఫ్ అండర్-19 జిల్లా కార్యదర్శి రామన్న తెలిపారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరిగే రాష్ట్ర పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, కాలేజ్ స్టడీ సర్టిఫికెట్‌లతో ఎంపికలకు హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు జిల్లా డీఎస్ఏకు చెందిన శాప్ జూడో కోచ్ పీఎస్ మణికుమార్ (9704934926)ను సంప్రదించాలన్నారు.



• నెరవేరుతున్న కల

పలాసలో రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, కిడ్నీ రీసెర్చ్‌సెంటర్ పనులు పూర్తి కావస్తున్నాయి. కొత్త రంగులు అద్దడంతో ఆస్పత్రి ఇలా కళగా కనిపిస్తోంది.

– కాశీబుగ్గ





ఉదయాన్నే నగరంలో మంచు

హిమపాతం.. ఆపై సూర్య ప్రతాపం

వాతావరణం సంక్లిష్టంగా మారుతోంది. రెండు రోజులుగా ఉక్కబోత జిల్లా ప్రజలను ఊపిరి ఆడనీయడం లేదు. సోమవారం ఉదయం శ్రీకాకుళం నగరంలో పొగమంచు కురిసింది. కానీ మధ్యాహ్నం తీవ్రమైన ఎండ, ఉక్కబోత జనాలను అల్లాడించేసింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం



మధ్యాహ్నం ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా ఉన్న రోడ్లు

